సాక్షి ప్రకాశం
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



సరిపోలేదా వంద రోజులు

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పరిహారం ఇచ్చి నీరు వదలాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. - 8లో..



చీటీపాటల పేరుతో మోసం సహించం

చీటీపాటల పేరుతో మోసం చేస్తే సహించబోనని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5/27.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మేజర్ అయిన తల్లిదండ్రులకు కన్నబిడ్డ అప్పగింత



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మేజర్ అయిన తల్లిదండ్రులకు వారి కన్న బిడ్డను కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా సోమవారం ప్రకాశం భవనంలో అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. పుల్లలచెరువు మండలానికి చెందిన కుండ భాస్కర్ రెడ్డి, నందినిలు 2022లో బాల్య వివాహం చేసుకున్నారు. నందిని గర్భం దాల్చడంతో బాల్యవివాహంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ సమయంలో భాస్కర్‌రెడ్డి సెంట్రల్ జైలుకు పోవడం, నందిని 17 ఏళ్ల వయసులో బాలికకు జన్మనిచ్చింది. దీంతో పాపను శిశుగృహలో ఉంచారు. తల్లి మేజర్ కావడంతో దంపతులు కలెక్టర్‌ను కలిసి పాపను అప్పగించాలని కోరడంతో పరిశీలించి పాపను అప్పగించారు. కలెక్టర్‌తో పాటు మహిళా శిశు సంక్షేమ అధికారి మాధురి, బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ ఉన్నారు.

జిల్లా విద్యుత్ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లు



కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా కట్టా వెంకటేశ్వర్లును నియమిస్తూ సీఎండీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో డీపీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) విజిలెన్స్‌లో పనిచేస్తున్న కట్టా వెంకటేశ్వర్లుకు జిల్లా ఎస్ఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్ఈగా ఉన్న కేవీజీ సత్యనారాయణకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కట్టా వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాకే చెందిన కట్టా వెంకటేశ్వర్లు 1991 ఆగస్టు 11న అప్పట్లో ఉన్న ఏపీఎస్ఈబీలో అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ) విధుల్లో చేరారు. 2024 ఫిబ్రవరి వరకు ఒంగోలు కన్‌స్ట్రక్షన్ డీఈఈగా విధులు నిర్వర్తించిన ఆయన ఫిబ్రవరి నుంచి డీపీ డీఈఈ విజిలెన్స్‌గా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ప్రస్తుతం సీఎండీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)హరిబాబు, ఒంగోలు టౌన్ డీఈఈ పాండురంగారావు, ఒంగోలు టౌన్ ఏఈఈలు, ఒంగోలు సెంట్రల్ ఆఫీస్ అధికారులు, సిబ్బంది కలిసి అభినందించారు.

సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

ఒంగోలు: మారుతున్న కాలానికి అనుగుణంగా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను దృష్టిలో ఉంచుకుని సాంకేతికతను నేటి తరం విద్యార్థులు తప్పకుండా అందిపుచ్చుకోవాలని కర్నూలు ట్రిపుల్ ఐటీ కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు అన్నారు. సోమవారం సాయంత్రం ఆంధ్ర కేసరి యూనివర్శిటీలోని సమావేశపు హాలులో డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రొఫెసర్ రాజమోహన్ రావు అధ్యక్షత వహించిన సమావేశంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కంప్యూటర్ విభాగం అధ్యాపకుడు వై.సురేంద్ర, యూనివర్శిటీ విద్యార్థులతో పాటుగా నాగార్జున డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవాటికి వాత.. ఉన్నవాటికీ కోత

కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఇంత వరకు వాటి జారీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొత్తవి ఇవ్వకపోగా ఇప్పటికే ఉన్న పింఛన్లను కూడా వెరిఫికేషన్ పేరుతో పెద్ద ఎత్తున తొలగిస్తోంది. ఈనెల నుంచి కొత్త పింఛన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు వాటికి సంబంధించిన వెబ్‌సైట్ కూడా తెరుచుకోలేదు. దీంతో అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు.

- కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు
- అక్టోబర్‌లో కొత్త పింఛన్లు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- ఉన్నవాటినీ తొలగిస్తున్న ప్రభుత్వం



గత ప్రభుత్వంలో పింఛన్ నగదు తీసుకుంటున్న లబ్ధిదారు (ఫైల్)

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమంపై చిన్నచూపు చూస్తోంది. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు కోసం ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. సచివాలయాల్లో దానికి సంబంధించిన వెబ్‌సైట్ కూడా తెరుచుకోలేదు. ఫలితంగా కొత్త రేషన్‌కార్డుల కోసం వివిధ పథకాల లబ్ధిదారులు.. కొత్త పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక కారణాలతో కొత్త రేషన్ కార్డులు రాక కొందరు.. కార్డులున్నా.. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని అవి మంజూరు కాక మరికొందరు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఇక ఉన్న పింఛన్లు తొలగించేందుకు కూడా కూటమి నాయకులు కుట్రలు చేస్తున్నారు. తమకు నచ్చని వారి జాబితా తయారు చేసి గ్రామసభల ద్వారా తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రస్తుత పింఛన్లు ఇలా..

జిల్లాలో 6 లక్షల 75 వేల మందికి రేషన్ కార్డులు ఉండగా.. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 75,942 రేషన్ కార్డులు ఉన్నాయి. జిల్లాలోని 45 మండలాల్లో 2,88,144 పింఛన్లు ఉండగా, కనిగిరి నియోజకవర్గంలో 38,194 పింఛన్లు ఉన్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం సాగేది.. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితికి బ్రేక్ పడింది. ప్రభుత్వం ఆసైట్‌లను ఓపెన్ చేయకుండా నిలుపుదల చేయడంపై పలు విమర్శలు వినవస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ నోటిఫికేషన్ నుంచి అంటే ఏప్రిల్ 18 నుంచి సైట్ ఆపారు. అప్పటి నుంచి మూడు నెలలు దాటినా.. ఇప్పటి వరకు సైట్ తెరుచుకోలేదు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినా.. ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడం లేదు. దీంతో పింఛన్ తీసుకునేందుకు 60 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగత్వం నిర్ధారణతో ధ్రువీకరణ పొందిన దివ్యాంగులు, భర్త చనిపోయిన వితంతువులు, కొత్తగా పెళ్లి అయిన వాళ్లు రేషన్‌కార్డుకు దరఖాస్తులు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డుల ఆలస్యం.. విద్యార్థులకు నష్టం:

రేషన్‌కార్డుల జాప్యంతో వివిధ పథకాల లబ్ధిదారులతో పాటు, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది. కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన విద్యా పథకాలు అందే పరిస్థితి ఉండదు. విద్యార్థులకు కళాశాలల్లో, కౌన్సెలింగ్‌లలో, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రక్రియకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డులు అవసరం. తెల్లరేషన్ కార్డులు ఉంటేనే రెవెన్యూ అధికారులు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని మెలిక పెడతారు. దీంతో అనేక మంది ఇంజినీరింగ్, వివిధ ఉన్నత చదువుల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేసేవారు. కానీ నేటి కూటమి సర్కార్ పాత పింఛన్ల పంపిణీ తప్ప.. ఇతర ఏ సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవు.

పింఛన్లు తొలగించే కుట్ర..

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు.. ప్రస్తుతం వస్తున్న పింఛన్లు తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రతినెలా వందల సంఖ్యలో పింఛన్‌దారులకు కోత పడుతోంది. ఆగస్టు నెలలో 2,91,419 పింఛన్లు ఉండగా, సెప్టెంబర్‌లో 2,89,096, అక్టోబర్‌లో 2,88,144 ఉన్నాయి. ఈ నెలలో గ్రామసభలు పెట్టి అనర్హత పేరుతో మరిన్ని పింఛన్లు తొలగించేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నేతలు చేస్తున్న కుట్రలపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో పింఛన్ల కోత ఇలా..

ఆగస్టు నెలలో పింఛన్లు	2,91,419
సెప్టెంబర్:	2,89,096
అక్టోబర్:	2,88,144

కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు, రేషన్ కార్డులకు మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆ ప్రక్రియను ప్రారంభిస్తాం. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌వీఎల్ హనుమంతరావు, ఎంపీడీఓ, కనిగిరి

నేడు బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం

- చర్చిసెంటర్ నుంచి మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ



బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్

ఒంగోలు: బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొంటున్న బీఎస్ఎన్ఎల్‌కు ఆదరణ పెంచే కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ గుంటూరు బ్రాంచి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి బీఎస్ఎన్ఎల్ స్థాపించి 24 సంవత్సరాలు పూర్తయిందన్నారు. పోటీతత్వాన్ని అధిగమిస్తూ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అత్యుత్తమ, నాణ్యమైన సేవలు అందిస్తుందన్నారు. ఇంటర్నెట్ ఫైబర్ కనెక్షన్లు గత పది సంవత్సరాలుగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అందిస్తుందని, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 40 లక్షలకు పైగా ఫైబర్ బేస్డ్ ఇంటర్నెట్ కనెక్షన్లను దేశవ్యాప్తంగా కలిగి ఉందని చెప్పారు.

2025 మార్చి నాటికి 50 లక్షలకు ఈ సంఖ్య చేరుకోవాలని లక్ష్యంగా ఉందని, గుంటూరు బ్రాంచి ఏరియా పరిధిలో 35667 ఫైబర్ ఇంటర్నెట్ కనెక్షన్లు కలిగి ఉన్నామన్నారు. ఈ సంఖ్య మార్చి నాటికి 38 వేలు దాటాలని నిర్ణయించుకున్నామన్నారు. తమ పరిధిలో 656 టవర్లు ఉంటే వాటిలో 175 టవర్లు స్వదేశీ 4జీ సాంకేతికతతో కూడుకున్నవని, మరో 60 టవర్లను కూడా ప్లాన్ చేస్తున్నామన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులతోపాటు వినియోగదారులు కూడా పాల్గొని తమ మద్దతు ప్రకటించాలని కోరారు.

దసరాకు ప్రైవేటు దోపిడీ

- ప్రయాణికులను దోచేస్తున్న ప్రైవేటు ఆపరేటర్లు
- ఒక్కో టికెట్ రేటుపై మూడింతలు వసూలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- ప్రయాణికులను ఆకట్టుకోవడంలో ఆర్టీసీ అనాసక్తి



ఒంగోలు: దసరా పండుగ సెలవులు వస్తుండటంతో అధిక టికెట్ ధరలతో అడ్డగోలుగా దోపిడీ చేసేందుకు ప్రైవేటు రవాణా ఆపరేటర్లు తెర తీశారు. ఒక్కో టికెట్ రేటును మూడింతలు పెంచేసి దసరా సరదాకు పరదా కట్టారు. ప్రయాణికులను ఆకట్టుకోవడంలో ఆర్టీసీ నిరాసక్తత కనిపిస్తోంది. ఒక వైపు ముందస్తు ప్లాన్ ఉన్నా దానిని ప్రయాణికుల వరకు తీసుకెళ్లడంలో కొనసాగుతున్న వైఫల్యం ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంటగా మారుతోంది. రాష్ట్ర స్థాయిలో ఆర్టీసీ అధికారులు దసరాకు ఎన్ని బస్సులు నడుపుతున్నారనే వివరాలను బహిర్గతం చేస్తే జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి మాత్రం ఇంకా దానికి సంబంధించిన షెడ్యూలు విడుదల చేయలేదు.

సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా:

ఒంగోలు–హైదరాబాదు, హైదరాబాదు–ఒంగోలుకు సాధారణ రోజుల్లో నాన్ ఏసీ సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.634గా ఉంది. ఏసీ ఇంద్రా అయితే రూ.819, వోల్వో రూ.1018 వసూలు చేస్తున్నారు. అధికారం చేపట్టగానే సూపర్ సిక్స్ అమలుచేస్తాం ...అందులో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితం అన్న ప్రభుత్వం ఆ దిశగా కసరత్తు చేయలేదు. దసరా, సంక్రాంతి పండుగల్లో ఏదో ఒక పండుగకు స్వగ్రామం నుంచి సుదూర ప్రాంతాల్లో ఉండేవారు తమ గ్రామాలకు కుటుంబ సమేతంగా వస్తుంటారు. ఒక వైపు విద్యా సంస్థలకు దసరా సెలవులు అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రకటించారు. 2వ తేదీ గాంధీ జయంతి పబ్లిక్ హాలిడే కావడంతో 1వ తేదీ సాయంత్రం నుంచే ఉద్యోగులు మినహా విద్యార్థులు, మహిళలు పల్లెబాటకు సిద్ధమవుతున్నారు.

ప్రైవేటు దోపిడీ ఇలా:

సాధారణ రోజుల్లో ప్రైవేటు ట్రావెల్స్ ఒంగోలు–హైదరాబాదుకు రూ.450 మొదలు రూ.700 వరకు వసూలు చేస్తున్నారు. ఏసీ సర్వీసులు అయితే రూ.1000 మొదలు రూ.1200 వరకు వసూలు చేస్తున్నారు. కానీ ఇవే బస్సులు దసరా సందర్భంగా పెరుగుతున్న ప్రయాణికుల తాకిడిని సొమ్ము చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. నాన్ ఏసీ బస్సుల్లో టికెట్ రేటు రూ.1390 మొదలు రూ.1890 వసూలు చేస్తుంటే ఏసీ బస్సుల్లో టికెట్ రేటు రూ.2500 నుంచి రూ.2700 ఉంది. ఇది దసరా ముందు హైదరాబాదు నుంచి ఒంగోలుకు రావడానికి. దసరా పండుగ అనంతరం అంటే ఈనెల 13న ఆదివారం రోజు రిటర్న్ జర్నీ సమయంలో టికెట్‌కు మరో వంద రూపాయలు పెంచి ప్రయాణికులపై భారం మోపుతున్నారు.

గతంలో ఇలా..

ప్రత్యేక పండుగ రోజుల్లో అసాధారణ పెంపును నిరోధించేందుకు ఆర్టీసీ, రవాణాశాఖ, జిల్లా అధికారులు సంయుక్తంగా ప్రైవేటు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించేవారు. అధిక రేటు వసూలు చేస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించేవారు. తద్వారా ప్రైవేటు ఆపరేటర్లు కూడా కొంత నియంత్రణలో ఉండేవారు. కానీ నేడు వెబ్‌సైట్‌లోనే అధికారికంగా అధిక ధరలు వసూలు చేస్తున్నా అటు రవాణా శాఖ గానీ, ఇటు ప్రభుత్వ అధికారులు గానీ ఎవరూ పట్టించుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నేడు ప్రత్యేక బస్సుల షెడ్యూలు విడుదల

దసరా సందర్భంగా ప్రత్యేక బస్సుల షెడ్యూలు సిద్ధమైంది. నేను జిల్లా కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో మీడియాకు మంగళవారం విడుదల చేస్తాం.

– బి.సుధాకర్‌రావు, ప్రజారవాణా విభాగం అధికారి

ఉపాధి పనుల కోసం గ్రామ సభలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టే పనులను గుర్తించేందుకు అక్టోబర్ 2వ తేదీ గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సోమవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ పూడికతీత పనులకు ప్రాధాన్యం తగ్గించి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా ప్రజల అభిప్రాయాలను, స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని వాస్తవ ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనుల గుర్తింపుతో పాటు లేబర్ బడ్జెట్ రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన కేసులపై ఆయా కోర్టుల్లో వెంటనే పిటిషన్లు వేయాలన్నారు. కంటెస్ట్ కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. పత్రికల్లో వచ్చిన వార్తలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ కోసంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కారం చేయాలన్నారు. స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు అవసరమైన సూచనలు, సలహాలు ప్రజలు ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ కనీసం 100 మందిని సర్వే చేసేలా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, కోర్టు కేసుల నోడల్ అధికారి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టులో ప్రకాశం క్రికెటర్లు



కె.ఆనంద్‌జోష్



కేఎస్ఎస్ సాత్విక్



సుమిత్



ఎం.లేఖజ్‌రెడ్డి



పాశం నవీన్

ఒంగోలు: రాష్ట్ర స్థాయి జట్లలో ప్రకాశం జిల్లా క్రీడాకారులు స్థానం సంపాదించుకున్నారని ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. అండర్ 19, 23 విభాగాల్లో జిల్లా నుంచి ముగ్గురికి స్థానం దక్కిందన్నారు. అండర్ 19 విభాగంలో కె.ఆనంద్‌జోషి, కేఎస్ఎస్ సాత్విక్‌లు ఎంపికయ్యారని, అండర్ 23 విభాగంలో జీవీఎస్ సుమిత్ స్థానం సంపాదించుకున్నట్లు వివరించారు. స్టాండ్‌బైగా వికెట్ కీపర్ లేఖజ్‌రెడ్డి, పాశం నవీన్‌లు కూడా అర్హత సాధించారని పేర్కొంటూ ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజలు ఎంతో నమ్మకంతో వారి సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వస్తారని, వారి సంతృప్తి స్థాయి పెరిగేలా సమస్యల పరిష్కారం చూపాలని అందుకు ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలు పరిష్కరించలేనప్పుడు ఉన్న విషయాన్ని అర్జీదారులకు తెలియచేసి వివరించాలన్నారు. మొక్కుబడిగా కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని, తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వరకుమార్, లోకేశ్వరరావు, కుమార్, సునీల్‌కుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

✦ తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన పిన్నెబోయిన తిరుపతమ్మ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని జగనన్న కాలనీలో 72వ పట్టా నంబర్ తనకు కేటాయించారని తెలిపారు. అయితే అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తన స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పరిశీలించి తన స్థలాన్ని తనకు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

✦ త్రిపురాంతకం మండలం గణపవరం గ్రామానికి చెందిన పరిమి కోటయ్య గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు రావాల్సి వేతనాలు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 2023 నుంచి గ్రామంలో స్వచ్ఛభారత్ కింద చెత్తబండి నిర్వహించానని, అయితే అందుకు ఎటువంటి వేతనం ఇవ్వలేదని పేదరికంతో గడవడమే కష్టంగా ఉందని పరిశీలించి వేతనం ఇప్పించాలని కోరాడు.

✦ ముండ్లమూరు మండలం తమ్మలూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తనకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 2020లో తన భర్త మరణించాడని అయినా తనకు పింఛన్ మంజూరు కాలేదని పరిశీలించి త్వరగా పింఛన్ మంజూరు చేయించాలని కలెక్టర్‌ను కోరారు.

సచివాలయ ఏఎన్ఎంలపై అదనపు బాధ్యతలొద్దు

సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను సంబంధం లేని పనులతో ఇబ్బందులు పెట్టవద్దని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు వినతి పత్రం సమర్పించారు. శాఖాపరమైన పనులతో పాటుగా ప్రతి నెలా పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి కరపత్రాల పంపిణీ, స్టిక్కర్లు అతికించడం లాంటి అదనపు పనులను అప్పగించడం సరైంది కాదన్నారు. దీనివలన వ్యాక్సినేషన్, ప్రజారోగ్య కార్యక్రమాలు, యాప్ పనులకు తీవ్రమైన ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఏఎన్ఎంలు పూర్తిగా ఆరోగ్య శాఖ బాధ్యతలు మాత్రమే నిర్వర్తించాలని స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు ఆ ఉత్తర్వులను ఏ మాత్రం లెక్కచేయడం లేదని తెలిపారు. ఇకనైనా సచివాలయ ఏఎన్ఎంలకు ఇతర బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇమ్యునైజేషన్ 8 సెషన్ల నుంచి 4 సెషన్లకు కుదించాలని, రెండో శనివారం, పబ్లిక్ సెలవుల్లో విధులు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు, అధ్యక్షుడు వై.సురేష్, కార్యదర్శి శ్రీధర్ బాబు, కోశాధికారి జి.నాగేశ్వరరావు, తాతపూడి ప్రియదర్శిని, శారదా, స్వాతి, మరియమ్మ, రమణ, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



మీకోసం గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన సచివాలయ ఏఎన్ఎంలు

బధిరుల పింఛన్లు తీసేశారు.. పునరుద్ధరించరూ

ఒంగోలు టౌన్: జిల్లాలోని 10 మంది బధిరుల పింఛన్లను తొలగించడంపై జిల్లా బధిరుల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ యం.రాజేంద్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన బధిరుల పింఛన్లను అకారణంగా తీసివేశారని తెలిపారు.

దీని వలన వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఆసరా లేక తీవ్రమైన మనోవేదన చెందుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు బధిరుల పట్ల మానవతా దృక్పథంతో ఆలోచించి పింఛన్‌ను పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు.

సరిపోలేదా వంద రోజులు?

- కృష్ణా ఉప్పొంగినా, శ్రీశైలం నిండినా 'వెలుగొండ'కు నీరేది?
- నిర్వాసితులకు పూర్తి పరిహారం ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలి
- వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



ధర్నాలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పరిహారం ఇచ్చి, నీరు వదలాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కోర్టు సెంటరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే వెలుగొండను అత్యంత ప్రాధాన్యతగా భావించి పూర్తి చేస్తామని చెప్పి వంద రోజులు దాటినా కూటమి ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. నిర్వాసిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. పునరావాస కాలనీల్లో కూడా డ్రైనేజీ, మంచినీటి సమస్య, రోడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ.. ఇటీవల భారీ వర్షాలతో కృష్ణా ఉప్పొంగి, శ్రీశైలం డ్యామ్ నిండినా వెలుగొండకు నీరివ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గు చేటన్నారు. కృష్ణా నది వరద నీరంతా వృథాగా సముద్రంలో కలిసిందని, కనీసం సాగర్ ఆయకట్టులో వరి సాగుకు కూడా నీరిస్తామని ప్రకటించకపోవడం ప్రభుత్వ అసమర్థతను తేటతెల్లం చేస్తోందన్నారు. మండల కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజలు సాగునీరు, తాగునీరు లేక, పంటలు పండక వలస పోతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి వెలుగొండకు నీటిని విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎన్జీఓ హోమ్‌లో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, వి.ఆంజనేయులు, నాగరాజు, ఉబ్బ వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

నిరసన పర్వం

సమాన పనికి ఇవ్వాలి సమాన వేతనం



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్: కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం నాయకుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు వేతనం అమలు చేసి, ఏడో తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలన్నారు. ఆర్థిక సరళీకరణ పేరుతో ఉద్యోగ, కార్మిక వర్గాలను ముక్కలు చేశారని మండిపడ్డారు. జిల్లాలో సీఐటీయూ సర్వే చేసి గుర్తించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో కాలం సుబ్బారావు, ఎం.రమేష్, కె.రాజు, సురేష్, కల్పన, సామ్రాజ్యం, కుమారి, టి.మహేష్, ఇశ్రాయేలు, పి.ఆంజనేయులు, సురేష్, సత్యనారాయణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రుల హక్కు' ను అంతం చేయొద్దు

- విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నేటి నుంచి నిరసన దీక్షలు
- ప్రజా సంఘాల నాయకుల వెల్లడి

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం మంగళవారం నుంచి మూడు రోజులపాటు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, విద్యార్థి, యువజన, రైతు సంఘాల నాయకుల సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చుండూరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి, కారు చౌకగా వేలాది ఎకరాల భూములు అప్పగించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను మూత వేసి దొంగ దెబ్బ తీయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ కుయుక్తులను ఉద్యమాల ద్వారా తిప్పికొడతామని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీపై మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మూడు రోజులపాటు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు. మంగళవారం యువజన, విద్యార్థి సంఘాలు, బుధవారం కార్మిక సంఘాల ఐక్య వేదిక, గురువారం రైతు సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. దీక్షలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఎం.రమేష్, గంటెనపల్లి శ్రీనివాసరావు, జజ్జురి జయంతి బాబు, పమిడి వెంకటరావు, వీరారెడ్డి, ఎంఎస్ సాయి, ఆర్ మోహన్, సీహెచ్ వినోద్, వీరస్వామి, తంగిరాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక, రైతు సంఘాల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి

ఇసుక కొరత తీర్చడంలో కూటమి సర్కారు విఫలం

- ఉచిత ఇసుక హామీని ఎక్కడ అమలు చేస్తున్నారు?
- పనులు లేక కూలీలు పస్తులుంటున్నారు
- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎంపీజే నాయకులు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీజె నాయకులు

మార్కాపురం: ఎన్నికల ముందు టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి నాయకులు ఉచిత ఇసుక ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో ప్రజలు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, ఇసుక కొరతను తక్షణమే నివారించాలని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఖాశీం, పట్టణ అధ్యక్షులు నాగూర్ మీరావలి తదితరులు సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో వారు సబ్‌కలెక్టర్‌ను కలిసి ఇసుక సమస్య పర్యవసనాలను వివరించారు. తొలుత కార్యాలయ ఆవరణలో ఇసుక కొరతను తీర్చాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీజే నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఇసుక కొరతను తీర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మార్కాపురం ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఇసుక అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ఇసుక కొనలేక గృహ నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. పనులు లేక కూలీలు పస్తులుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు వంద రోజులైనా ఉచితం కాదు కదా.. అందుబాటులో ఉంచితే చాలనే పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో టన్ను రూ.1100కు ఇసుక లభించగా.. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇస్తామని చెప్పడంతో ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించారని అన్నారు. ప్రస్తుతం మార్కాపురంలో టన్ను ఇసుక రూ.2 వేలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇసుక ధరలను తగ్గించాలని, లేదంటే ప్రజా సంఘాలతో కలిసి ఎంపీజే ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీజే ఫౌండర్ సభ్యులు షేక్ రసూల్, సయ్యద్ వలి, అబ్బాస్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ ఓనర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబు



మృతుని భార్యతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న సీఐ

పామూరు: స్థానిక నెల్లూరురోడ్డులో 167బీ జాతీయ రహదారి బైపాస్‌లో అనుమానాస్పద స్థితిలో లారీ యజమాని మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. సీఐ య.భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు పామూరు కరెంట్ ఆఫీస్ కాలనీలో నివాసముంటున్న సిద్దవటం వెంకటేశ్వర్లు (46) 167బీ జాతీయ రహదారి మార్జిన్‌లో ఆగి ఉన్న లారీ పక్కనే అనుమానాస్పద స్థితిలో మృతి చెంది పడి ఉన్నారు. రోడ్డుపై వాకింగ్ చేసే వారు విషయాన్ని సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబుకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కాళ్లకు, మెడకు విడివిడిగా పురికొసల తాడుతో కట్టినట్లు గుర్తించారు. మృతుని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న క్లూస్ టీం మృతదేహం, లారీ ఉన్న పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ ఎం భీమానాయక్ మృతిని భార్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత నాలుగురోజుల క్రితం మృతుడు ఇంటి నుంచి వెళ్లారని, శనివారం తాను ఫోన్‌చేయగా రాత్రికి వస్తానని చెప్పాడని, ఆదివారం ఫోన్‌చేసినా ఎత్తలేదని అతని భార్య రాజేశ్వరి తెలిపింది.

చీటిపాటల పేరుతో మోసం చేస్తే సహించం

- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: చీటిపాటల పేరుతో ప్రజలను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికకు 97 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసుస్టేషన్ పరిధిలోని పోలీసు అధికారులతో మాట్లాడిన ఆయన ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. చట్టప్రకారం తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిటీపాటల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చీటీల వ్యాపారం, చిట్‌ఫండ్ అండ్ ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు. చీటీపాటలకు డబ్బులు కట్టే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తమకు బాగా తెలిసిన వ్యక్తులు, మంచి వ్యక్తులు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, చిరువ్యాపారులు నిర్వహించే అనధికార చీటీపాటలలో డబ్బులు కట్టవద్దని సూచించారు. అటువంటి వ్యక్తులు దివాలా తీసి ఐపీ పెట్టి పారిపోయే ప్రమాదం ఉందన్నారు. కొందరు వ్యక్తులు అత్యధిక వడ్డీకి ఆశ పడి చీటిపాటల నిర్వాహకులకే చీటి పాడిన డబ్బులు వడ్డీకి ఇస్తుంటారని, అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, నిర్వాహకుల వద్ద మాత్రమే చీటీలు కట్టాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన వెంకట రమణమ్మ

బేస్తవారిపేట: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేస్తవారిపేట మండలంలోని శింగరపల్లెలో జరిగింది. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి కథనం ప్రకారం...శింగరపల్లె ఎస్సీకాలనీకి చెందిన వెంకట రమణమ్మతో దగ్గర బంధువు కామునూరి వెంకట రమణతో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పవన్‌కుమార్, దివ్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. దివ్య ఇంజినీరింగ్ చదువుతున్నది. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనే తపనతో వెంకట రమణమ్మ ఉండేది. భర్త బేల్దారి పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో మద్యం సేవించి పిల్లల ఫీజులు కట్టకుండా ఉండేవాడు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. వారం క్రితం అలిగి జీనోపాధి కోసం శింగరపల్లె నుంచి హైదరాబాద్ వెళ్లిన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. తల్లి దాసరి వెంకట లక్ష్మమ్మకు సర్దిచెప్పి ఆదివారం ఉదయం కుమార్తెను తీసుకుని శింగరపల్లె వచ్చింది. కూలీ పనులకు వెళ్లిన వెంకట రమణ సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు ఫూటుగా మద్యం తాగి వచ్చాడు. పదే పదే చెబుతున్నా ప్రవర్తన మార్చుకోవడం లేదంటూ మనస్తాపానికి గురైంది. రాత్రి ఇంట్లోని బాత్‌రూమ్‌లోకి వెళ్లి తలకు రంగు వేసుకునే సూపర్‌వాస్మల్ తాగింది. వాంతులు చేసుకుంటూ ఇంట్లో పడిపోవడంతో కూతురు పరిస్థితి గమనించిన తల్లి వెంకటలక్ష్మమ్మ అల్లుడు, బంధువులకు సమాచారం ఇచ్చింది. కుటుంబసభ్యులు కారులో కంభం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు మృతురాలి తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏకేయూ లైబ్రరీకి పరిశోధన నివేదికలు



పరిశోధన నివేదికలు అందిస్తున్న బీవీ సాగర్ తదితరులు

ఒంగోలు: బాలల హక్కుల చట్టాలపై పరిశోధన చేసే యూనివర్సిటీ స్కాలర్స్‌కు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, దేశంలోని వివిధ సంస్థలు చేసిన పరిశోధన నివేదికలను ఆంధ్ర కేసరి యూనివర్సిటీ లైబ్రరీకి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, సంస్థ కోఆర్డినేటర్ ముక్తి నూతలపాడు మురళీకృష్ణ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ పరిశోధన కొనసాగించడానికి ఈ నివేదికలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

భరోసా బాగానే ఇచ్చారక్కాయ్..!

- పోలీస్ కళ్యాణ మండపంలో హిజ్రాలతో ఎస్పీ దామోదర్ భేటీ
- బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక



ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి ఫొటోకు ఫోజిస్తున్న హిజ్రాలు

ఒంగోలు టౌన్: హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడినా., గ్రూపులుగా విడిపోయి శాంతి భద్రతల సమస్యలు సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో హిజ్రాలతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కొందరు హిజ్రాలు వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడటం, భిక్షాటన పేరుతో అశ్లీలంగా ప్రవర్తించడం వల్ల ఆత్మగౌరవం దెబ్బతింటుందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. సామాజిక వివక్షను, అణచివేతను ఎదుర్కోవడానికి హిజ్రాలు అందరిలాగే ఉన్నత చదువులపై దృష్టి సారించాలని, విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించాలని హితబోధ చేశారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా సంక్షేమ శాఖల అధికారులతో చర్చిస్తామని, చిరువ్యాపారులు నిర్వహించుకునేందుకు రుణాలిప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఎస్పీ నేరుగా తమతో మాట్లాడటంతో కొందరు హిజ్రాలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషన్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, తాలుకా, సింగరాయకొండ సీఐలు కె.అజయ్ కుమార్, హజరత్తయ్య, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించినప్పుడే ఎవరికి వారు వ్యక్తిగతంగా సంతృప్తి పొందగలుగుతారని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల ఆవరణలో సోమవారం ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం ఆధ్వర్యంలో । ఎన్ఈపీ -2020 దేశీయ విజ్ఞానం । అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యా సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయన్నారు. భారతీయ విద్యా విధానంలో అనేక మెళకువలు ఉన్నాయని, వీటిని పిల్లలకు పాఠశాల దశ నుంచే అలవాటు చేసుకునేలా చిన్నారులను సమాయత్తం చేయాలని సూచించారు. ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీలతో నిర్భయంగా, స్వేచ్ఛగా బతకాల్సిందేనని, ఇందుకోసం భారతీయులు ఏర్పాటు చేసుకున్న చట్టాలపై ప్రజలు తప్పకుండా గౌరవాన్ని చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయడం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి తాను ఎంచుకున్న అభ్యసన అంశంలో పూర్తి స్థాయిలో పరిజ్ఞానం లభిస్తుందని తెలిపారు. కర్నూలు ట్రిపుల్ ఐటీ కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం అమలులో దేశీయ విజ్ఞానం ప్రయోజనకారిగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నటరాజ కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం ప్రతినిధులు, న్యాయ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం అనంతరం సభికులు ఏకేయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మూర్తిని ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు.

2న ఎస్టీయూ అత్యవసర సమావేశం

ఒంగోలు: రాష్ట్రోపాధ్యాయ సంఘం అత్యవసర సమావేశం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈ నెల 2న ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రమణారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ప్రస్తుతం విద్యాశాఖలో చోటుచేసుకున్న పలు అంశాలపై చర్చిస్తామన్నారు. 117 జీఓ రద్దు, 12వ పీఆర్‌సీ, బకాయిపడిన డీఏలు, సరెండర్ లీవులు తదితర అంశాలపై జరిగే కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులంతా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.

బాలికను చితకబాదిన ఉపాధ్యాయుడు

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక ప్రైవేట్ స్కూలు ఉపాధ్యాయుడు 8వ తరగతి చదివే బాలికను చితకబాదాడు. దీంతో ఆ బాలిక స్పృహ తప్పిపడిపోయింది. ఈ ఘటన సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన కథనం ప్రకారం ...13 ఏళ్ల బాలిక సుజాతనగర్‌లో ఉన్న ఒక ప్రైవేట్ స్కూలులో 8వ తరగతి చదువుతుంది. రోజులాగే సోమవారం స్కూల్‌కు వెళ్లిన బాలిక, ఆమె స్నేహితులు సరదాగా మంచి నీటి దగ్గర గొడవపడుతున్నారు. ఇది గమనించిన ఒక ఉపాధ్యాయుడు ఆవేశానికి గురయ్యాడు. చిన్న పిల్లల మధ్య దూరి బాధిత బాలిక వీపుపై, చెంపలపై తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలు తాళలేక సదరు బాలిక స్పృహ తప్పిపడిపోయింది. దీంతో భయాందోళనకు గురైన పాఠశాల యాజమాన్యం వెంటనే ఆ బాలికను కిమ్స్ వైద్యశాలకు తరలించారు. తీరిగ్గా తలిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆందోళనకు గురైన తలిదండ్రులు వెంటనే ఆస్పత్రికి చేరుకొన్నారు. ఇదిలా ఉండగా ఇలాంటి ఘటనలు నగరంలో తరుచూ జరుగుతున్నాయి. ఇటీవల నగరంలోని ఒక ప్రముఖ కార్పొరేట్ స్కూలులో ప్లే స్కూలు పిల్లలు తనను చూసి నవ్వుతున్నారంటూ ఒక ప్రిన్సిపాల్ పసిపిల్లలపై దాడి చేసుకున్నాడు. అభం శుభం తెలియని చిన్నారుల మీద చేయిచేసుకోవడంతో కొందరు తల్లిదండ్రులు స్కూలుకు వెళ్లి నిలదీయగా క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.

గర్భిణిపై దాడి కేసులో రెండేళ్ల జైలుశిక్ష

ఒంగోలు: గర్భిణిపై దాడి కేసులో నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి కోమలవల్లి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామానికి చెందిన దొంతిబోయిన లావణ్య అనే గర్భిణి పాత వివాదం దృష్టిలో ఉంచుకొని 2018 డిసెంబర్ 23న పులుగు విఠల్‌రెడ్డి మద్యం సేవించి ఫిర్యాది వాళ్ల ఇంటిపై రాళ్లు విసిరాడు. దీన్ని ప్రశ్నించిన ఫిర్యాది లావణ్య, వారి కుటుంబసభ్యులపై పులుగు విఠల్‌రెడ్డి, విజయసింహారెడ్డి, వెంగళరెడ్డి, నరశింహారెడ్డి అలియాస్ బూసిరెడ్డి, ధనలక్ష్మి, చిలకమ్మ, గాంధీ అనే వారు దాడిచేసినట్లు నాగులుప్పలపాడు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించగా సమర్థవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేస్తూ నిందితులకు శిక్షపడడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రస్తుత కొండపి సీఐ జి.సోమశేఖర్, కోర్టు లైజన్ పి.శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు కోర్టు కానిస్టేబుల్ ఈ.పోతురాజులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారిణి దుర్మరణం

కావలి: పట్టణ పరిధిలోని మద్దూరుపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ క్రీడాకారిణి మృత్యువు పాలైంది. కావలి రూరల్ ఎస్సై ఎం బాజీబాబు వివరాల మేరకు..ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సన్నిబోయిన మైథిలి (15) అదే జిల్లా ముండ్లమూరివారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పల్నాడు జిల్లా వినుకొండలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సహచర విద్యార్థినులతో కలిసి వెళ్లింది. సోమవారం వినుకొండ నుంచి ఒంగోలుకు చేరుకున్న మైథిలి తన స్వగ్రామానికి చెందిన కుంచాల కృపాకర్ అనే వ్యక్తితో కలిసి స్కూటీపై నెల్లూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో మద్దూరుపాడులోని దాబా వద్ద చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వారి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మైథిలి తీవ్రంగా గాయపడగా, కృపాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మైథిలిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో విద్యార్థిని మరణించింది. విద్యార్థిని మైథిలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారూ.. చల్లగా ఉండాలా మీరు?

- బదిలీపై వెళ్తూ ఆఫీసులో ఏసీ తీసుకెళ్లిన ఎక్సైజ్ అధికారి
- ఇదేం పద్ధతని విస్తుపోతున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: ఆయనో పెద్ద ఉద్యోగి. ఆయన ప్రాతినిధ్యం వహించే శాఖకు జిల్లా బాస్. పేరుకు పెద్ద ఆఫీసరే కానీ బుద్ధి మాత్రం చిన్నదని నిరూపించుకున్నారు. బదిలీపై వెళ్తూ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఏసీని తీసుకెళ్లారు. ఈ విషయం ఇప్పుడు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అసలు ఏం జరిగిందంటే.. ఆయన ఎక్సైజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారి. రెండు చేతులా సంపాదించే ఉద్యోగం.. వద్దన్నా వచ్చిపడే డబ్బు.. అయినా సరే ఊరికే వచ్చేది ఎందుకు వదిలి పెట్టాలని భావించినట్టున్నారు. ఎన్నికల బదిలీలో భాగంగా గత జనవరిలో ఒంగోలులో బాధ్యతలు చేపట్టిన ఆయన తాజాగా సాధారణ బదిలీల్లో ఈ నెల 26న జిల్లా నుంచి వెళ్లిపోయారు. ఆయన విధుల్లో ఉన్న సమయంలో ఆఫీసులో ఒక దాత సహాయంతో కొత్తగా ఏసీ ఏర్పాటు చేశారు. తన హయాంలో ఏర్పాటు చేసింది కనుక తనదే కదా అనుకున్నారో ఏమో.. బదిలీపై వెళ్తూ వెళ్తూ ఆఫీసులో ఏసీని కూడా తనతో పాటు తీసుకెళ్లారు. ఎవరైనా చూస్తే బాగోదనుకున్నారో ఏమోకానీ అర్ధరాత్రి వేళ ఆఫీసుకు చేరుకుని ఏసీ తీసుకెళ్లినట్లు తెలిసింది. తమ బాస్ 'చిన్న బుద్ధి' తెలిసి ఆ శాఖ ఉద్యోగులు విస్తుపోయారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా జిల్లా అంతా పాకడంతో ఎక్సైజ్ ఉద్యోగులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.